411) గౌళ

ప|| హరియు సిరియు నేగే రదివో తేరు | పరం జ్యోతిస్స్వరూపపు పైడికుండతేరు ||

చ|| గరుడధ్వజపుదేరు కనకమయపు దేరు | సురలు బొమ్మలైనారు చుట్లదేరు |
మెరుగులమేఘములమించుగొణిగెలతేరు | సిరుల ధ్రువలోకపుశిఖరపుదేరు ||

చ|| బలుకులపర్వతాలె బండికండ్లైనతేరు | పలుదిక్కులంచులవున్నతపుదేరు |
కొలదిలేనిచుక్కలకుచ్చులముత్తేలతేరు | మెలపునాకాశగంగమేలుకట్లతేరు ||

చ|| మునులనే వుత్తమాశ్వములగా గట్టినతేరు | ఘనమహిమలసింగారపుదేరు |
యెనసి శ్రీవేంకటేశు డెపుడూ నలమేల్మంగ | దినదినభోగముల దిరమైనతేరు ||